# ఉంగరాల చేతులు

''వాణి దూము వాణ్ణి ఎత్తుకోని పోనాని! యముడు ఎత్తుకోని పోతాఉంటే జవుళ్లో పణ్ణె మిడిగాలపు నాబట్ట! వాణి శాతల్లో పుండు పుట్టా! కుందనంపు బొమ్మె ఆ బిడ్డ! వాణికి ఎట్టాణ్ణాయమ్మా చేతులు అంత పని చేసేదానికి? ఆ పాణం ఎట్టా పాయనో? ఎట్టెట్టా యిలపించెనో? ఏం కతో?... తాగుబోతు నాబట్ట బిడ్డ! ఆడెవుడో చెప్పినట్టు యాదిలో చెప్పుతో గొట్టి యింట్లో కాళ్లు పట్టుకుణ్ణెట్టు మల్లా పైనబడి పాడిపాడి యాడస్తాడు- ఈళ్లూ వాళ్లూ చూసి మెచ్చుకోవాలని! సిగ్గూ సెరం రొండూ లేని యదవ...''

మా బాశాలి ఆ యీాదిలో చావుకాడికి పొయ్యేసి వచ్చింది. ఒక పక్క చీదిచీది ఏడస్తా ఉండాది. యింకొక పక్క చెడామడా వాయించేస్తా ఉండాది. ఉండబట్ట లేకుండా-

''అదిగాదే? వాడూ చీమూా నెత్తురుండే మొగోడే గదా? ఈణ్ణి గాదని అది యింకొకణ్ణి మరుక్కుంటే...''

''నువ్వు అదేపనిగా పొయ్ చూసేసి వచ్చినావా?''

''ఆడది చెయ్యాలనుకుంటే కనిపెట్టేదానికి బెమ్మదేవుడి వల్ల గూడా కాదంటా ఉంటే...''

''అయితే అది ఎవుణ్ణో మరుక్కుణ్ణిందని నువ్వెట్టా మొరగతావు?''

''వాడు యిసంబెట్టింది కుర్దుగా నువ్వు పొయ్ చూసొచ్చినావా? మల్లా వాణ్ణి ఎందుకట్టా తిట్టిపోస్తా ఉండావే?''

''ఎప్పుడోగాదు. నిన్న సందేళకాణ్ణే! ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ఎదురు పడె. కాలు మింద కాలేసుకోని కార్లో కూసోనుంటే చూసేదానికి రొండు కండ్లూ చాలవే? అట్టాంటిది తెల్లారే కాడికి ఎట్ట చస్తిందే?''

''చచ్చే దానికి ఏముండాదే? సవాలచ్చ కారణాలు.''

''పోనీ! నీ మాటకే వస్తా. ఎట్టా చచ్చిందో చచ్చింది. మొగుడే యిసం పెట్టి చంపేసినాడని ఊరు గుప్పుమనె. అయినా జరగాల్సిందంతా గుట్టు చప్పుడుగా జరిగె పాయెనే! అదే బీదా బిక్కీ అయ్యుంటే? ఈ పోలీసోళ్లు యిడ్సి పెట్టుంటారా? గుట్టకు గుక్కెడు నీళ్లు తాగిపించి ఉండరా? అయినా ఈ పేపరోళ్లుగూడా ఆడికాడికే ఉండార్లే?''

''నడిమిద్దె వాళ్లకత ఎందుకే? వాళ్లేం చేస్తారు?''

''ఎంత నంగనాసి టంగుబుర్రమ్మా? ఏమీ ఎరగనట్టు మాట్లాడ్తాడు. హూ!

సిలమాల్లో ఆడవి. ఒంటి మింద వొాగిటికి సగంగా గుడ్డలేసుకోని ఎగరమంటే ఎగిరే ఆడవి! అవ్విగానా మొగుణ్ణి వొదిలేసిందంటే మొదిటి పేజీలోనే తాటికాయంత అచ్చిరాల్తో అచ్చు గుద్దేస్తారు. అవునా? అదే మల్లా ముగ్గురు బిడ్డల తండ్రికి మూడో పెండ్లాం అయ్యిందంటే అంతకన్నా పెద్ద పెద్ద అచ్చిరాల్తో యేసేస్తారు. ఎందుకు? దాని ఆస్తి అంతస్తు చూసి. అదే పాపం! ఎవురో ఒక అంబేదుగురాలు. మొగుడొదిలేసినాడు మొర్రో! అంటే దాని మొర యినిపించుకోరు.''

మా బాశాలి వాదించిన దాంట్లో తేలిందేందంటే సెగితుంటే ఏం చేసినా చలామణీ అయిపోతింది. అదే లేకుండాపోతే చిక్కుల్లో చిగులుకుంటారు. అని.

ఆలోచించాల్సిన పాయింటే గదా మరి? మొగుడే పెండ్లానికి యిసం పెట్టి చంపె. ఎందుకు చంపె? వాణ్ణి కాదని పెండ్లాం యింకొకణ్ణి ఎవుణ్ణో మరుక్కుణ్ణిందని. అదెంత మట్టుకు నిజిమో? అపద్దమో? ఆ మండేవోడికే ఎరిక. అయినా ఊరు కోడై కూసె. పోలీసే వాడికి నీడై నిలిసె. వాడు కలిగినోడు కాబట్టి సరిపాయ. అదే యింకొకడు యింకొక డయ్యుంటేనా? – చెరువుకు శారదు నీళ్లు తాగాల్సిందే?

ఆ దెబ్బతో నేనే చెంబుడు నీళ్లు తాగేసి ఎలబార్నా.

దోవన నడస్తావుంటే మాబాశాలి మాటే మణుసులో మెదల్తా ఉండాది. సెగితి ఉన్నోడు ఏం చేసినా చలామణి అయిపోతాడు. అదే లేనోడు చేస్తే అగచాట్లు పాలవతాడు? అవుగదా మల్లా? ఎంటికలున్నమ్మ ఏ కొప్పేసినా చెల్లిపోతింది.

వాడు యిప్పుడుండాడో? లేడో? – ఆ! యింకా యాడుంటాళ్లే? నేను అంత పిలగాడుగా ఉండేటప్పుడే వాడికి ఆడొక ఎంటిక ఆడొక ఎంటిక నరస్తా వుండె. ఎప్పుడో టిక్కట్టు తీసుకోనుంటాడు. మాఊరికి సరిగ్గా తూరుపు పక్క ఒక పల్లెలో బోయుడొకడు ఉండే వాడు. వాడి పేరు సవరాలబోయుడు!..

మట్టులోతు తొవ్వేదానికి యింతని మాట గట్టుకోని మోటబావులు తొవ్వేది... చేద బావులు తొవ్వేది... కొంపాగోడో కట్టుకోవాలంటే బండలు పగలగొట్టి రాళ్లు చదరపించి యిచ్చేది... మిట్టాగట్టుగా ఉంటే నేలను సేద్దానికి అరువు చేసి యిచ్చేది బోయుళ్ల పని. అయితే మాత్రం సవరాలబోయుడు చేతికి అంత మట్టిగాకుండా వొంటికి సెగదగలకుండా జమ్మని బతికేసినాడు.

అది ఎట్టా సాద్దిపడిందబ్బా అంటే? –

గొర్రె నమ్మేది కసాయోణ్ణే అన్నెట్టు. తియ్యంగా మాటలు చెప్పి యామారించే నాయాండ్లనే ఈ రొండుగాళ్ల గొర్రెలుగూడా నమ్మేది.

ఆడది అపద్దం చెప్తే గోడ కట్నెట్టు... అదే మొగోడు చెప్తే తడిక యేసినట్టని పెద్దోళ్లంటారు. అయితే ఈ మాట సవరాలబోయుడి దగ్గర తిరగబడింది. వాడు నోరు యిప్పినాడంటే వాడు ఎటువంటి కోళ్లను గెల్సిన కోడైనా సరే! నోరు తెర్సుకోని యింటా ఉండాల్సిందే!

సవరాలబోయుడు యిల్లు ఎలబారాల అనుకున్నాడంటే ఆ పొద్దంతా ఒక పొద్దు ఉంటాడు. ఒక పొద్దు అంటే నిమ్మరసం తాగతానో నీళ్లమాదిర బీరుతాగతానో యిప్పుడు మనోళ్లు నిరాహారదీచ్చలు చేస్తారే? అట్టా మాదిరి కాదు. సవరాలబోయుడు ఆ పొద్దు చచ్చినా పచ్చి మంచినీళ్లు గూడా నోట్లో పోసుకోడు. ఆ పొద్దంతా అట్టా మాదిర ఉపోసం ఉంటాడు. పొద్దు గూట్లో పడ్తా పడ్తా ఉంటే అప్పుడు యిలవేల్పును కొల్సుకుంటాడు.

ఆ అపరసందేళ కాడ యింట్లో వాడి బాశాలి తలస్నానం చేస్తింది. చలవ చేసిన గుడ్డే కట్టుకుంటుంది. ఇల్లూ వాకిలీ సుబ్బరం చేసుకోని నట్టింట తళిగేస్తా ఉంటింది. ఈ లోపల్నే బోయుడు ఒక్కొక్క బాయిలో తొమ్మిది మునకలేస్తా మూడు బావుల్లో మునగతాడు. ఆ తడిగుడ్డల్తోనే యింటికొస్తాడు. కూతకొచ్చిన కోడి పుంజునే ఒకదాన్ని పట్టుకుంటాడు. దాని రొండు కాళ్లూ పట్టుకోని తలకాయిని కిందికి యాలాడేసి నట్టింట కొలువు తీర్నె యిలవేల్పుకు మూడుసార్లు ఇట్టా మూడుసార్లు అట్టా దిగతీస్తాడు. ఆ మిందట దాని మెడకాయి పట్టుకోని నులిమేసి యింటి ముందర వాకిట్లో యిసిరి పారేస్తాడు. అది పాణం పోలేకుండా అట్టా కొంచేపు యిట్ట కొంచేపు ఎగిరెగిరి పడ్తింది. రోంత సేపు కొటకలాడి కొటకలాడి ఎట్నో వొకట్టాపడి పాణం వదిలేస్తింది.

దాని తలకాయి ఏపార్శానికి పడ్తే ఆ దిక్కుకు పొమ్మని అది సగిణం చెప్పినట్టు లెక్కంట. ఆ మరసటి దినం తెల్లారేకుందికి వాడా దిక్కును బట్టుకోని ఎలబార్తాడు. ఏ ఊళ్లోనో ఒక ఊళ్లో వాడికి మణుసొచ్చిన చోట మకాం పెట్తాడు. రోంత పచ్చంగా వుండే యింటిని పసిగట్తాడు. ఆ యింటి ముందర్నే వస్తాపోతా ఆ ఊరును రొండు మూడు చుట్లేస్తాడు.

అట్టా యిట్టా చూస్తాడు. ఎవురో ఎంటపడి తరమతా ఉన్నెట్టు ఆ యింట్లోకి జొరబడ్తాడు. గడగడ వణికిపోతా ఆ యింటాయన పాదాల మిందపడి! 'అయ్యా! నన్ను తమరే రచ్చించాలయ్యా!' అంటా ఆయన రొండు పాదాల్ని వొడిసి పట్టుకుంటాడు.

పాపం! ఆ యింటి ఆసామికి ఏమీ అర్తంగాకుండా అయోమయంగా చూస్తా ఉంటే–

''సామీ! కొలాన మేము బోయోళ్లం. మాకేం ఒక ఊరా? ఒక పల్లా? యాడ పని దొరికితే అదే మా ఊరు. యాడ ఒక రైతు 'బాయి తొవ్వాలరా!' అంటే ఆ అయ్యే మాకు ఆదరవ. మేము ముగ్గురు అన్నదమ్ముళ్లము. నేనే అందుల్లోకి పెద్దోణ్ణి. నా యిద్దరు తమ్ముళ్లా? లచ్మణమూర్తులే. గీసిన గీతదాటి ఎరగరు. నాకు నలుగురు మొగపిలకాయిలు. రొండోవాడికి ముగ్గురు ఆడ పిలకాయిలు. ఒక మొగపిలకాయ. కడగోటోడికి ముగ్గురు మొగపిలకాయిలు. ఒక ఆడ కూతురు. పిలకాయిలందురూ చేతికి ఎదిగొచ్చినోళ్లే. మా కుటుంబ్రం అంతా పారా గెడ్డపార తట్టా బుట్టా చేతులకెత్తుకోని ఎలబారిందంటే– అది ఏడేడు పద్నాలుగుమట్లు·అయినా ఎనుకూముందు చూసేదిలే. జల కండ్ల చూసేదాకా ఎనిక్కి జగ్గేదిలే. అటుమంటి సంసారం అల్లాకులు పల్లాకులై పాయ. నారగతం పంచుకోని పుట్నోళ్లే నారగతం కండ్ల చూస్తానంటా వుండారు. దినగెండం నూరేండ్ల ఆయుస్సుగా నెట్టుకోని వస్తా ఉండా. నన్నెట్టా రచ్చిస్తారో దేవరా! తమరే రచ్చించాల.'' అంటా బొరోమని ఏడ్సేస్తాడు.

రైతంటే మట్టిని బువ్వగా మార్సే మహోత్తుడు గదా? కష్టం అంటే కండ్ల చూళ్లేడు. కుడుం చేతికిస్తే చాలు. పండగంటాడు. అందుకే వాడి నంగేడుపులకు లొంగి పోతాడు!

''అంత పని ఎందుకయిందిరా?'' అని అడగతాడు.

రైతు అడిగీ అడగకముందే బోయుడు అందుకుంటాడు!

''ఏమని చెప్పమంటారు సామీ! చెప్తే వొక బాద. చెప్పకుండా పోతే యింకొక బాద. ఎట్టా చెప్పలేకుండా నాలో నేనే మల్లగుల్లాలు పడిచస్తా ఉండా!'' అంటా పైగుడ్డతో కండ్లు వొత్తుకుంటాడు.

ఆ రైతు కండ్లల్లో నీరు తిరిగినంత పని అవితింది. బోయుడు అది గెమనించేస్తాడు.

''నాకు తెల్సు సామీ! మీ మణుసు ఉండాదే అది ఎన్న కంటేగూడా మెత్తన. లేకుండా బోతే ఈ పాయికట్లో ఎన్ని ఊళ్లుండాయి. ఆమాటకొస్తే ఈ ఊళ్లో ఎంతమంది రైతుల్లేరు. అందుర్నీ యిడ్సిపెటేసి తమరి దగ్గిరికే వచ్చినానంటే అది దేముడాగ్నె.!''

దేముడి మాట ఎత్తేకుందికి ఆ యింటాయన యింకా మెత్తబడి పోతాడు.

బోయుడికి యినుముతో మంచి అనుబోగం ఉండాది. గెడ్డపారలు మొద్దుబారి పోతే మొన ఎయిపించుకోవాల గదా. ఇనుమును బాగా కాగినప్పుడే కొట్టాల. మణిసి మెత్తబడి నప్పుడే సోదీనానికి తెచ్చుకోవాల. ఇది బోయుడికి కంటోపాటమే. అందుకే అందుకుంటాడు.

''పోడుచేను కాడ ఒకరైతు. కొంచెం ఎచ్చూ తక్కువగా తమరి తూకం తూగతాడు. బాయి తొవ్వమంటే తొవ్వతా ఉంటిమి. బండో గిండో పడుంటే ఏ బాదా లేదు. పెట్టాలంటే నాట్లు గీట్లు పెట్టి పగలగొట్టుకో నుందుము. ఏకంగా లిబ్బి బయట పడె. ఒక బిందా? రొండు బిందెలా? ఏకంగా ఏడు బిందెలు!''

కురస్తా ఉండే మేగం కల్లా మెరస్తా ఉండే కండ్లతో చూసినట్టు ఆ రైతు బోయుడి మొకంలోకి చూస్తా ఉంటాడు. సవరాలబోయుడంటే సటపటమైనోడా? ఆవిళించితే పేగుల లెక్కపెట్టే నాయాలు గదా?

''సీత పుట్టె లంక జెడె. అనే యవారం అయిపాయ మా బతుకు. లిబ్బేమో దొరికె సామీ! దరిద్రంబట్నె యదవనాకొడకలం గదా? మాలో మాకే పొత్తలు బోలా. ఒకణ్ణి లేపేసి ఇంకొకడు దాన్ని కొట్టేయ్యాలని వొకరి మిందొకరు మాటేసి కూసుణ్ణారు. ఈ గెండాన్నుంచి ఎట్టయినా ఎత్తి నన్నట్టా గెడ్డన పడెయ్యాల్సింది తమరే దేవరా!''

''ఈ యిలాకాలో పెద్ద పెద్ద తలకాయలు ఎన్నో ఉండాయి గదా. ఆ తలకాయల ముందర మన కతలేం ఉడక పోతాయి?'' అన్నెట్టుగా ఆ యింటాయన చూస్తా ఉంటే–

''తమరికి తెలవనిది ఏముండాది సామీ? పాయ్ పాయ్ ఉంగరాల చేతుల్లో పాయ్ పడ్తే ఉరువు చిక్కితిందా? పరువు నిలిస్తిందా? 'ఎవురెవురికి చేరాల్సింది వాళ్లకే చేరాల. నువ్వు ఆడికి పోరా యదవా!' అంటా దేముడు తరమతా ఉంటే కాదనే దానికి ఎన్ని గుండెకాయ లుండాల? అందుకే గదా సామీ! దేముడాగ్నె పకారం నేను ఎతుక్కుంటా తమరి

కాడికొచ్చింది. తమరి దగ్గిర ఎంత ఉంటే అంత యిచ్చెయ్యండి. ముగ్గురు ఎలబారి నాతో రండి. సందు చూసుకోని మూడు బిందిలు ఎత్తిచ్చేస్తా.''

నాటకం ఆణ్నుంచి మొదులవుతింది.

పాపం! ఆఎర్రిబాగలోడు ఈ మాటలకు సుద్దంగా ఏమారి పోతాడు. ఎనుకూ ముందూ చూడకుండా కొంపలో ఉండే దుడ్డు దుగ్గాణి నగా నట్రా అంతా ఎత్తి బటువుగా మూటకట్టి యిచ్చేస్తాడు.

సగిణం బాగాలేదని ఒక దినం... తమ్ముళ్ళిద్దురూ బాయికాణ్ణే కావిలిగాస్తా ఉండారని యింకొకదినం... బాయికాడ మణిసీ మట్రా మెదల్తా ఉండారని యింకొకదినం. ఇట్టా కుంటి సాకులు చెప్తా చెప్తా నాలుగైదు దినాలు నెట్టేస్తాడు. కడాన ఒకదినం కన్ను పొడ్సుకుణ్ణా కనపరాని చీగిట్లో ఎలబార్తారు. గాలిపీల్చి యిడిస్తే గూడా ఎవుడైనా గెవనిస్తాడేమో అని ఊపిరి బిగబట్టుకోని అడుగు మింద అడుగ్గా ఆ బాయి కాడికి పోతారు. బోయుడి మణుసులే బాయిలో దిగతారు. వాళ్లు బిందిలు అందిస్తే ఎత్తుకోని పరిగెత్తాలని ఈళ్లు గెడ్డమిందనే నిలబడుకోని ఎదురుచూస్తా ఉంటారు.

బాయిలోకి దిగినోళ్లు తొవ్వేదానికి మొదులు పెడ్తారు. తొవ్వతా తొవ్వతా ఆడవుండే కాళీబిందె మింద గెడ్డపార్తో వొక్కదెబ్బ యేస్తారు. అది టంగ్‌మని మోగుతుంది. ఆ శపద్దంతో– 'ఎవురాడ్రే?' అని అరస్తా వొక గుంపు వచ్చి ఈళ్ల మింద పడ్తింది. వాళ్ల శాతల్లో దుడ్డి కట్టెలు కత్తులూ చూసి ఊపిరుంటే ఉప్పన్నా అమ్ముకోని బతకచ్చని ఈళ్లంతా పడ్తా లేస్తా దిక్కుకొకరుగా పరిగెత్తారు.

''అయ్యో! వొగిటి అనుకుంటే యింగొగిటి అయిపాయ్‌నే. దేవుడు చిన్నచూపు చూసెనే.!'' అంటా బోయుడు వగస్తాడు.

''జరిగిందేదో జరిగి పొయ్యింది. పోతేపోనీ! నేను యిచ్చిందన్నా నాకిచ్చేయ్!'' అని రైతు అంగలారస్తాడు.

అప్పుడు ఎర్రమనాయుడు సీన్‌లోకి వస్తాడు!

ఎర్రమనాయుడంటే ఎవురనుకుణ్ణారు? చిన్నబిడ్డనడుగు ఆ యిలాకాలో అటువంటోడు పుట్టడు. పుట్టబోడని చెప్తాడు. తలకాయిలో పేన్నెత్తి అడిగినా తడుముకోకుండా చెప్తింది. మణిసి చూడు గుమ్మిడి పొండు మాదిర్తో గుమ్మటంగా ఉంటాడు. నిమ్మపొండు రంగుతో నిగనిగా మెర్సిపోతా ఉంటాడు. మల్లెపూ మాదిర్తో తెల్లంగా వుండే గుడ్డలు... నొసట ఎర్రనాము... ఏలేలికి ఉంగరాలు– మణిసిగానా ఎదిటికొస్తే ఆడేణ్ణో బాపనోడుగా పుట్టాల్సినోడు ఈ కమ్మోళ్లల్లో ఎట్టా పుట్నాడబ్బా? అనుకుంటారు. శీరామ నవమికి హరికతలు చెప్పించాలన్నా... బారతాన్ని కంగుందికుప్పం వాళ్లతో ఆడించాలన్నా ఆ యిలాకాలో ఆయన పేరు చెప్పే యింకొకరి పేరు చెప్పాల!

అటువంటి మొనగోడే మద్దిస్తం చేస్తాడు.

రైతు కాదనే దానికి ఉండాదా? కాదన్నా వాడి మాట నెగ్గితిందా?

ఎర్రమ నాయుడు యింటి ముందర కుర్సీలో దర్జాగా కూసుంటాడు. ఈళ్లిద్దరూ ఆయనకు ఎదురంగా చెరొక పక్క మడి చేతులు కట్టుకోని నిలబడ్తారు. అప్పుడు ఎర్రమనాయుడు యిద్దర్నీ యిశారిస్తాడు. జరిగి పొయ్యిందానికి యిశారపడ్తాడు.

''ఒరే బోయుడూ! మనం చేసే ప్రతి పనీ దేవుళ్లు పైనుండి చూస్తావుంటారు. చెప్పే మాట్లు యింటా వుంటారు. అందువల్ల మనం చేప్పేమాట ఎట్టుండాలంటే దేవతలుగూడా తదాస్తు అనాల. ఊడిపాయ. జారిపాయ అంటే కుదరదు. నీ తిప్పలు నువ్వుపడు. సగానికి సగం తెచ్చియ్యాల్సిందే! – ఎందుకంటే యిద్దర్లో తప్పుండాది కాబట్టి! –

''తమరి దయ దేవరా!'' అంటాడు బోయుడు.

''మహన్నబావుడు నాయుడు కలగ చేసుకోకుండా ఉంటే నేను నోట్లో నడిమేలు పెట్టుకోవాల్సిందే గదా? ఇటుమంటి పుణ్ణాత్తులు యింకా ఈ బూమ్మీద ఉండంగానే పొద్దు పుట్టి తెల్లార్తా ఉండాది.'' అని రైతు రొండు చేతులెత్తి దణ్ణం పెట్టి తిరిగి చూడకుండా వచ్చిన దారి పట్టుకుంటాడు.

అయితే ఆ సగంలో సగం నాయుడు యింటికాడికి నడ్సి వొస్తిందని ఆ ఎరిముండకు ఏం తెల్సు?

''ఆహాహా! సవరాలబోయుడి బతుకంతా యిట్నే కడతేరి పాయనే?'' అని ఆలోచించుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడికి వచ్చేకుందికి ముత్తారెడ్డన్న ఎదురు పడె. నిలబడ్తి!

ఆడ ఎవుడో ఒకడు. ఏలేలికి ఉంగరాలేసుకోని మణిసి శానా జబర్దస్తీగా ఉండాడు. ఒకరిక్సా వాడి జుట్టు వొడేసి పట్టుకున్నాడు. కుక్కను ఈడ్సుకొని పాయ్‌నట్టు ఈడ్సుకోని పోతా ఉండాడు. వాడిచేతిలో ఉంగరాలు రేపటెండకు తళుక్ తళుక్ మని మెరస్తా ఉండాయి!

ఏంకత అంటే? – వాడు రొండే రొండు దినాలు రిక్సా బడిగ కట్టలేదంట!

నేను నోరు తెర్సుకోని అట్నే చూస్తా ఉండా.

''ఒరే అబ్బోడా! ఉంగరాల చేతులంటే ఏమనుకున్నావురా? పెట్టాలన్నా ఉంగరాల చేతులే! కొట్టాలన్నా ఉంగరాల చేతులే! ఆ ఉంగరాల చేతులు తల్సుకుంటే బోపార్స్ తుపాకుల కత తుస్సుమని పోతింది. ఆ ఉంగరాల చేతులు తల్సుకుంటే బస్సులు లారీలు సెణాల్లో కిష్టుడి చేతిలో చక్రం మాదిర మారిపోతాయి.ఎవుర్ని లేపెయ్‌మంటే వాళ్లను నిమిశాల్లో లేపేస్తాయి. పోనీ నాకు తెలవకుండా అడగతా ఉండా సుదర్శన చక్రం ఎవురిమిందికిరా? దురుమార్గుళ్ల మిందికా! పదిమందికీ పనికొచ్చే వాళ్లమిందికా! పదిమంది కోసరం పోరకలాడే వాళ్ల మిందికే! నువ్వు పోరా!'' అనె.

అయితే మన ముఖ్యమంత్రి ఏలేలికి ఉంగరాలు ఏసుకోనుండాడే ఎందుకబ్బా? అని సందేహ పడ్తే తీర్సే వాళ్లెవురు? ●